క్లుప్తంగా

ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉండాలి



ఎరువుల అమ్మకాల వివరాలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

పోడూరు: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎల్లప్పుడూ ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. పోడూరు–1 రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుభరోసా కేంద్రం ద్వారా ఎరువుల విక్రయాల వివరాలను కియోస్క్ మెషీన్‌ను పరిశీలించి తెలుసుకున్నారు. ఎరువుల విక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పంట ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలనీ, రైతులకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు వెంట మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ ఉన్నారు.

హౌసింగ్ బోర్డులో కుక్కల బెడద

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డులో కుక్కల బెడద ఎక్కువయ్యాయి. వాహనాలపై వెళ్తున్న వారిని, నడచి వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. శుక్రవారం 4వ తరగతి చదువుతున్న నక్కిన మల్లేష్‌పై దాడి చేసి గాయపరిచాయి. బుగ్గమీద, కాళ్లపై గాయాలయ్యాయి. ప్రస్తుతం మల్లేష్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల బెడద నుంచి మునిసిపల్ అధికారులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

టౌన్ హాల్ వద్ద పోలీసుల మోహరింపు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు టౌన్‌హాలు వద్ద శుక్రవారం పోలీసులు మోహరించారు. సంక్రాంతి పండుగపేరు చెప్పి క్లబ్‌ల్లో పేకాట వంటి జూద క్రీడలు ఆడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు పట్టణంలోని టౌన్ హాలులో తనిఖీలు చేసి అక్కడే వేచి ఉన్నారు. పోలీసులు తనిఖీలు మొదలు పెట్టడంతో టౌన్‌హాల్‌లో ఉన్న సభ్యులు మొత్తం రోడ్లపైకి పరుగుపరుగున వచ్చేశారు. పోలీసులు అక్కడే ఉండడంతో టౌన్‌హాల్ సభ్యులు రోడ్లపైనే వేచి ఉన్నారు. ఎస్సై బాదం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే క్లబ్‌ల్లో ఏ విధమైన జూద క్రీడలు ఆడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తోపుడు బండి అందజేత



మహిళకు తోపుడు బండిని అందజేస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: భర్తను కోల్పోయి పుట్టెడు బాధలో ఉంటూ తాను బతకడానికి చిన్న వ్యాపారం చేసుకుంటున్న మహిళకు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ చేయూతనందించారు. శుక్రవారం స్థానిక నాల్గవ వార్డులో నివాసం ఉంటున్న క్రొవ్విడి లక్ష్మీనరసమ్మ రెండేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. అప్పటి నుండి తన జీవనోపాధిగా ఇంటి వద్దే చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తుంది. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె దీనవస్థను చూసి చలించిన తాతాజీ ఆమె వ్యాపారం నిమిత్తం తోపుడు బండిని అందజేశారు. కార్యక్రమంలో తలుపూరి బుజ్జి,అంజూర్తి శ్రీను, కాసా నానాజీ, మోర్త గిరీష్,రాజారెడ్డి, కొరగింజల హనుమంతు, త్సవటపల్లి కృష్ణమోహన్, దిద్దే చిట్టిబాబు, చోడగిరి రమేష్ బాబు, పిల్లా అప్పాజీ, తెన్నేటి శ్యామ్యూల్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో కోడిపందాల స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో 2 కోడిపుంజులు, 1200 నగదు, 5 మోటార్ సైకిళ్లు, 10 కోడికత్తులు స్వాధీనం చేసుకుని 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. అలాగే మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11మందిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

సెలవు రోజుల్లో వేతనమివ్వాలని వినతి

పాలకొల్లు సెంట్రల్: సెలవు రోజుల్లో పనిచేస్తున్నందుకు జీతాలు చెల్లించాలని పట్టణంలో చెత్త సేకరణ వ్యాన్ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్లు తమ 19 వ్యాన్లను నిలుపుదల చేసి నిరసన తెలిపారు. తాము స్వయంభు ట్రాన్స్‌పోర్టు ద్వారా జీతాలు అందుకుంటున్నామని, ఇటీవల ఆదివారంతోపాటు ఇతర పండుగ రోజుల్లో కూడా పనిచేయాలని సూచించగా గత డిసెంబర్ నెల నుంచి ఆదివారం , పండుగ రోజుల్లోను వాహనాలు నడుపుతున్నామన్నారు. కానీ సెలవుదినాల్లో పని చేస్తున్నందుకు రావాల్సిన జీతాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ నెల్లుట్ల ప్రమోద్‌కుమార్‌కు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

సంక్రాంతి సందడి.. చూసొద్దాం పదండి..

- గ్రామాల్లో సంక్రాంతి జోష్
- కళకళలాడుతున్న పల్లెలు
- ప్రతి ఇంటా ముగ్గులు గొబ్బెమ్మలతో సందడి



పెనుమంట్ర సంక్రాంతి సంబరాల్లో గొబ్బెమ్మలను పెట్టే కార్యక్రమంలో పాల్గొన్న షర్మిలారెడ్డి



పెనుమంట్రలో సాంప్రదాయ కోడిపందాలను తిలకిస్తున్న మహిళలు, పిల్లలు

పెనుమంట్ర: గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. బంధువులతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ప్రతి ఇంటా ముగ్గులు..గొబ్బెమ్మలతో ఆడాళ్లు సందడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పెనుమంట్రలోని రామాలయం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో రాజమండ్రి రుడా చైర్‌పర్సన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్య, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా యూత్ నిర్వహించిన క్రీడా, ముగ్గుల పోటీలలో విజేతలైన వారికి ఆమె చేతులు మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైపర్సన్ వెలగల వెంకటరమణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ మేడపాటి విజయసింహా రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గండి శ్రీనివాసరావు, కర్రి సుధాకర్‌రెడ్డి, తమనంపూడి శ్రీనివాసరెడ్డి, తేతలి సాయిబాబా రెడ్డి, కొవ్వూరి నాగరాజారెడ్డి, ద్వారంపూడి బాలకృష్ణారెడ్డి, నల్లిమిల్లి రామిరెడ్డి, తేతలి బాపిరెడ్డి, సత్తి చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

పితానిమెరకలో..

నరసాపురం రూరల్: మండలంలోని పితానిమెరక గ్రామంలో శుక్రవారం జాజులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ పాల్గొని సంక్రాంతి విశిష్టను వివరించారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువు, గొబ్బిళ్లు, గంగిరెద్దులు, హరిదాసు, బుడబుక్కల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పాలకొల్లు అర్బన్: శ్రీ లలితా మహిళా మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీనగర్‌లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు నడింపల్లి అన్నపూర్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. కోళ్ల స్నేహలత, పుష్ప, పెచ్చెట్టి లక్ష్మీ విమల, కడలి రామలక్ష్మి వరుస బహుమతులు గెలుచుకున్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్నవారికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి ఉపాధ్యక్షురాలు నడింపల్లి హారిక, సభ్యులు మహ్మద్ మొబీనా, పైలా రాజశ్రీ, ర్యాలి శుభ, కుసుమే ఝాన్సీ హేమలత పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో

పాలకొల్లు సెంట్రల్: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపేది సంక్రాంతి పండుగని మునిసిపల్ కమిషనర్ నెల్లుట్ల ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మునిసిపల్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు ఏర్పాటుచేశారు. కమిషనర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది మొత్తం సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు.



పితానిమెరకలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నడింపల్లి అన్నపూర్ణ



వాలీబాల్ విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

కమిషనర్ భోగి మంటలు వెలిగించగా మహిళలు భోగి మంట చుట్టూ తిరుగుతూ సాంప్రదాయ నృత్యాలతో కోలాటం చేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరాజు, ఏఈ సతీష్, సిఎంఎం మేనేజర్ రత్నాకర్, జి 1 సతీష్, శ్రీరాజ్ పాల్గొన్నారు.

పూలపల్లిలో

పాలకొల్లు అర్బన్: సంస్కృతి, సాంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి గంటాలమ్మ దేవాలయ ఆరవణలో శుక్రవారం ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు మాజీ ఎమ్మెల్సీ శేషుబాబు–శశికళ దంపతులు బహుమతులు అందజేశారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి విజేతగా నిలిచిన తాతపూడి రాజేశ్వరికి గ్రైండర్, రెండో విజేత దొమ్మేటి జ్యోతికి మిక్సీ, మూడో విజేత సీహెచ్ రూపకు రైస్ కుక్కర్, అలాగే కన్సోలేషన్ బహుమతులుగా స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పైలా రాజశ్రీ, పెచ్చెట్టి విమల, కడలి రామలక్ష్మి, పైలా వరలక్ష్మి, మహ్మద్ మొబీనా, విజయ భవాని, గంగుల లక్ష్మి, ఎం.మణి, కుసుమే హేమలత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కడలి శివకుమారి, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ నాయకులు దొమ్మేటి శ్రీను, గంటా వెంకన్న, ఉనికెల శ్రీనివాస్, దొమ్మేటి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కొడమంచిలిలో యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలను ఆచంట ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ ప్రారంభించారు. శుక్రవారం భోగి మంటలు, వాలీబాల్ పోటీలు, రంగుల రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఎస్సై బీవీడీ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి రాజేష్, పంచాయతీ సభ్యులు పుచ్చకాయల నాగార్జున, బొక్కా రామకృష్ణ, నల్లూరి చందు, దొమ్మేటి రాంబాబు, పోలిశెట్టి వనమరాజు, చెల్లా సుభాకర్, డ్రిల్ మాస్టర్ చిరంజీవి, టీఎన్‌డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరులోనూ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. సాంప్రదాయ క్రీడలు వైపు మొగ్గ చూపాలని, జూదాలను ప్రోత్సహించవద్దని ఆచంట ఎస్సై బీవీడీ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచ్ నేలపూడి బేబీ, వైస్ ఎంపీపీ తాళం శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: గ్రామీణ క్రీడల పట్ల యువతీ యువకులు మక్కువ పెంచుకోవాలని తెలంగాణా ఎమ్మెల్సీ ప్రముఖ రచయిత గోరేటి వెంకన్న సూచించారు. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముత్యాలపల్లిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ క్రీడలైన కబాడ్డీ, వాలీబాల్ ఆటల్లో నైపుణయత సాధించి యువత జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుతీసుకు రావాలన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రధమ స్థానం సాధించిన వేములదీవి జట్టుకు నగదు బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన ముత్యాలపల్లి జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి సాధించిన మొగల్తూరు జట్టుకు రూ.6వేలు, నాలుగో స్థానం సాధించిన వారతిప్ప జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి అందించారు. ముగ్గులు పోటీల్లో ప్రధమ స్థానం సాధించిన మహిళలకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.1,500 నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో వర్ధిల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణ చంద్రరావు, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, నిర్వాహకులు కొల్లాటి రామారావు, రేవు రాంబాబు, కర్రి వీరాస్వామి, సాధనాల రాము, దొంగ యుగంధర్, కొల్లాటి గంగాచలం, బర్రి సామోరు. దొంగ కృష్ణ ఉపాధ్యాయుడు దొంగ చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: తెలుగు రాష్ట్రాల ప్రజల జీవితాల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానముందని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. యలమంచిలిలో సంక్రాంతి సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల విజేతలకు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ఆడపడచులకు సంక్రాంతి అంటే ముందుగా గుర్తుకువచ్చేవి ముగ్గులు, గొబ్బిళ్లు అన్నారు. ఆధునిక ప్రపంచంలో యువతులు సైతం ఉద్యోగాలబాట పట్టడంతో గ్రామాలలో కూడా ముగ్గులు వేసే యువతుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ముగ్గులకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలనే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్, యలమంచిలి, మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు చివటపు నాగేశ్వరరావు, గుర్రాల వెంకట్రావు కాజ తూర్పు, పెనుమర్రు సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, మేడపాడు ఎంపీటీసీ దేగల సూర్యప్రభ పాల్గొన్నారు.



పాలకొల్లులో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న కమిషనర్ ప్రమోద్‌కుమార్



యలమంచిలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ



వల్లూరులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ లావణ్య, సర్పంచ్ బేబీలు



పాలకొల్లులో సంక్రాంతి ముగ్గులు పెడుతున్న మెప్మా సిబ్బంది



పూలపల్లిలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు



కొడమంచిలిలో భోగి మంటలు వేస్తున్న నాయకులు, అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



వద్దిపర్రులో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కవురు శ్రీనివాస్

పోడూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని జెడ్పీ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. పోడూరు మండలం వద్దిపర్రు గ్రామంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి జెడ్పీచైర్మన్ శ్రీనివాస్ ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అవ్వతాతలను, మహిళలను, రైతులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ ఆప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..?లేదా..? అని ఆరా తీశారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నవారంతా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, మండల ఇన్‌చార్జి కలిదిండి గణపతిరాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, గ్రామసర్పంచ్ వద్దపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ విప్పర్తి శారద , గ్రామకమిటీ అధ్యక్షుడు వద్దపాటి ఆనందరాజు, ఏఎంసీ డైరెక్టర్ వద్దపాటి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడిశెట్టి నారాయణమూర్తి, మామిడిశెట్టి భద్రయ్య, వద్దపాటి సుధాకర్, కుక్కల వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి వెంకట్రావు ఎంపీడీఓ ఎం.బలరామరాజు, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

మొగల్తూరు: రైతులు తమ సాగు చేసే పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ సలహ మండలి కమిటీ చైర్మన్ కంచర్ల బాబులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహ మండలి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ జి.అనితకుమారీ, ఏఓ ఎం.సుజాత, ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, పశు వైద్యాధికారి నీలిమా, ఇరిగేషన్ ఏఈ మోహన కృష్ణ, సభ్యులు అయితం బాబులు, గూడూరి మావుళ్ళు పాల్గొన్నారు.

జుత్తిగలో..

పెనుమంట్ర: రైతుల ధాన్యాన్ని దగ్గరలో ఉన్న రైస్‌మిల్లులకు పంపించుకునే విధంగా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని మండల వ్యవసాయ సలహామండలి చైర్‌మన్ కొవ్వూరి రామకృష్ణసూర్యసత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జుత్తిగ గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో జరిగిన మండలస్థాయి సలహామండలి సమావేశానికి ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో చర్చించిన రైతుల సమస్యలను జిల్లాస్థాయికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎం జయదుర్గామాధురి, సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవులకు మేలు చేయడానికి కృషి



ఏపీపీఎఫ్ నూతన కమిటీని ప్రకటిస్తున్న ముఖ్య సలహాదారుడు వైఎస్ థామస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జీవన్‌కుమార్

పాలకొల్లు అర్బన్: క్రైస్తవ సమాజానికి మేలు చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారుడు డాక్టర్ వైఎస్ థామస్ రెడ్డి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని వడలవానిపేట త్రియేకదేవుని సంఘం గొల్ల రాజబాబు చర్చిలో శుక్రవారం జరిగిన పాస్టర్ల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ జీఓ విడుదల చేయడం చారిత్రాత్మకమైన అంశమన్నారు. ఏపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జీవన్‌కుమార్ మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఉన్నతాధికారులతో త్వరలో సమావేశం కాబోతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీని డా.వైఎస్ థామస్‌రెడ్డి ప్రకటించి నియామకపత్రాలు అందజేశారు. గౌరవాధ్యక్షుడిగా కేఎంఎస్ కృష్టాషర్, అధ్యక్షుడు పుచ్చకాయల యేసుదాసు, ఉపాధ్యక్షుడు డా.గొల్ల రాజబాబు, కార్యదర్శి ఇంజమూరి రవీంద్రబాబు, కోశాధికారి డా. పిట్టా వర సుదర్శన్ శుభరాజు, జాయింట్ సెక్రటరీలు వర్ధనపు శ్యాంబాబు, యార్లగడ్డ ప్రభుదాసు, కార్యవర్గసభ్యులుగా బి.ఆంద్రేయ, చల్లం గమానియేలు, కె.జాన్, పి.చిన్న, ఎం.సతీష్, జీజే పీటర్, కె.జేమ్స్, ఎన్ పాలరాజులను నియమించారు. ఈ కార్యక్రమంలో దళిత క్రిస్టియన్ సెల్ చైర్మన్ పెరికే వరప్రసాద్, రెవ.రూబేన్, యేసేబురాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం



దిగమర్రులో ఆర్థిక సహాయం అందిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం దిగమర్రులో వీర ఆంజనేయులు, వీర హనుమాన్ మాధవిలకు చెందిన రూ.50 వేలు విలువైన ప్లాస్టిక్ సామాన్లు శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు అమ్మవార్ల ఉత్సవాల్లో జరిగే తీర్థాల్లో ప్లాస్టిక్ సామగ్రి విక్రయించుకుని ఉపాధి పొందుతున్నారు. సంఘటనను తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, ఉప సర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు రాపాక సునిబాబు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), పాలపర్తి కుమారరత్నం పాల్గొన్నారు.